సాక్షి
వికారాబాద్
ఆదివారం। 5। నవంబర్। 2023



వ్యయం... పరిమితం

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పక్రియ మరూ అయింది. అభ్యర్థులు పెట్టే వ్యయంపై ఈసీ బృందాలు ఫోకస్ పెంచాయి. 10లో▸



యువతే నా బలం

వెన్నంటి నడిచిన యువతను మరిచిపోలేనని. యువతే మా బలమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు అన్నారు. 11లో▸



'ధరణి' పేరుతో దగా

ధరణి పేరుతో రైతులను దగా చేసిన ప్రభుత్వాన్ని పాతరేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు. 11లో▸

న్యూస్‌రీల్

రేపు రేవంత్ నామినేషన్

కొడంగల్ రూరల్: ఈ నెల 6న టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కొడంగల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారని ఆయన కార్యాలయ సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

నాటు సారా స్థావరంపై దాడి

50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకం స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెద్దేముల్: నాటు సారా తయారీ స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్, పెద్దేముల్ పోలీసులు దాడులు చేసి, 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం పెద్దేముల్ మండలం మదనంతపూర్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు చేయగా.. ధారూర్ మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ ద్విచక్ర వాహనంపై 22 లీటర్ల నాటు సారా తీసుకెళ్తూ పట్టుబడ్డారు. అనంతరం సదరు వ్యక్తి వివరాలతో సారా తయారీ స్థావరంపై దాడి చేసి, బెల్లం పానకం ను ధ్వసం చేశారు. తయారీ దారుడైన రమేష్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వారి మాయమాటలకు మోసపోవద్దు

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: ప్రతిపక్ష నేతల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ప్రత్యేక తెలంగాణ ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని చూసి ఆదరించాలని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం మోమిన్‌పేట వెల్‌చాల్ నుంచి నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి నయాపైస ఇవ్వమని చెప్పిందని, విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలని చెప్పినట్లు ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కరెంటు కష్టాలను తీర్చడమే కాకుండా, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి కటకటకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. ఎన్నికలు అనగానే ప్రజలపై ఎన్నడూ లేనంత ప్రేమ చూపుతూ మాయమాటలతో మీ ముందుకు వస్తున్న ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని, అలాంటి వారి మాటలకు ఆగం కాకుండా ఆలోచించి అభివృద్ధి, సంక్షేమానికి ఓటియ్యాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనంద్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, సీనియర్ నాయకుడు నర్సింహ్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, మండల యువత అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తాండూరులో తొలి నామనేషన్ దాఖలు



నామపత్రం సమర్పిస్తున్న మనోహర్‌రెడ్డి

తాండూరు: ఎన్నికల క్రతువులో భాగంగా తాండూర్‌లో శనివారం తొలి నామినేషన్ దాఖలు అయింది. తాండూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి.. ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్వ సుజాతతో కలిసి రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావుకు నామపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని, ఎన్నికల్లో గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శోభారాణి, నాయకుడు డాక్టర్ సంపత్‌కుమార్ ఉన్నారు.



తాండూరు టౌన్ బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి



పెద్దేముల్: కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీ వాణిశ్రీకి పార్టీ కండువా వేస్తున్న మనోహర్‌రెడ్డి

గులాబీ, హస్తం ప్రచారం ముమ్మరం

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఓటర్ల ప్రసన్నం కోసం పాట్లు పడుతున్నారు. శనివారం తాండూరు నియోజకవర్గంలో అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడారు. 'నా తోడ్పాటుతో పాటు యువత అండగా ఉంటే రోహిత్ గెలుపు తథ్యం' అని ధీమా వ్యక్తంచేశారు. పెద్దేముల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. – సాక్షి, నెట్‌వర్క్

రెండో 'సారీ'!

పరిగి బరినుంచి తప్పుకొన్న 'కాసాని'

- ఆరు నెలలుగా నియోజకవర్గంలో హడావుడి
- టీడీపీ అస్త్రసన్యాసంతో వెనుకడుగు
- అయోమయంలో అనుచరులు, మద్దతుదారులు



వికారాబాద్: ఏడాది కాలంగా హల్‌చేసిన కాసాని జ్ఞానేశ్వర్.. తీరా ఎన్నికల సమయంలో పోటీ నుంచి తప్పుకోవటం విమర్శల పాలు చేస్తోంది. 2009లో సొంత పార్టీతో ఇదే తరహాలో పరిగి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీకి హడావుడి చేశారు. బీసీ ఫీలింగ్ తీసుకురావటంలో సఫలీకృతుడైనా.. చివరకు పోటీ నుంచి తప్పుకొని అభాసు పాలయ్యారు. అదే తరహాలో ఈసారి ఆయన తనయుడు వీరేశ్.. ప్రస్తుత ఎన్నికల్లో పరిగి నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా బరిలో దిగుతానంటూ.. సభలు, సమావేశాలు, ర్యాలీలతో ఉరకలేశాడు. సర్వేలు చేపట్టారు. కేడర్‌ను పోగేశారు. తనకంటూ ఓ వర్గాన్ని తయారు చేసుకున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి అనేక మందిని 'దేశం'లో చేర్చుకున్నారు. ఈసారి బీసీ ఫీలింగ్ అంతగా వర్కవుట్ కానప్పటికీ తన సామాజిక వర్గమైన ముదిరాజ్‌లను తనవైపు తిప్పుకొన్నారు. తీరా నామినేషన్లు వేసే సమయానికి ప్రస్తుత ఎన్నికల్లో తెలంగాణలో పోటీ చేయడం లేదని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బాంబు పేల్చడంతో తండ్రీకొడుకుతో పాటు తెలుగు తమ్ముళ్లు తీవ్ర నిరాశకు గురయ్యారు.

అప్పుడు తండ్రి.. ఇప్పుడు కొడుకు

నాడు మన పార్టీ పేరుతో సొంత కుంపటి ఏర్పాటు చేసుకున్న కాసాని జ్ఞానేశ్వర్.. 2009 ఎన్నికల బరిలో పరిగి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమై.. నియోజకవర్గంలో సభలు, సమావేశాలు నిర్వహించారు. బీసీ నినాదంతో కదం తొక్కారు. కమతం రామ్‌రెడ్డి, కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి వ్యతిరేకంగా టీడీపీ, కాంగ్రెస్‌ల నుంచి అనేక మంది నాయకులు కాసాని వెంట నడిచారు. పక్కాగా గెలుస్తారనే విస్తృత ప్రచారం జరిగింది. కానీ చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో వారి అనుచరులు మండిపడ్డారు. అప్పుడు తండ్రి, ఇప్పుడు కొడుకు ఇద్దరూ ఆయన వెంటన నడిచిన వారిని నట్టేట ముంచారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ పార్టీలు, ముఖ్య నేతలను కాదని కాసాని వెంట నడిచినందుకు తగిన శాస్తే జరిగిందంటూ వాపోతున్నారు.

అనుచరగణం అయోమయం

జిల్లాలో టీడీపీకి పెద్దగా కేడర్ లేనప్పటికీ పరిగిలో కొంత బలంగానే ఉంది. ఆరు నెలలుగా కాసాని ఎన్నికల హడావుడి చేయడంతో ఇంకాస్త పుంజుకుంది. అయితే పార్టీలో మొదటి నుంచి ఉంటూ వచ్చిన పరిగి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రయ్య, దోమ మాజీ ఎంపీపీ రాజ్‌గోపాల్‌చారి తదితర సీనియర్లు వీరేశ్ రాకతో అలక బూనారు. సీనియర్లను ఆయన పట్టించుకోవటం లేదంటూ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వచ్చారు. చివరకు పార్టీ సీనియర్లలో కొందరు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరగా.. మరి కొందరు కాంగ్రెస్ బాట పట్టారు. అయినప్పటికీ వీరేశ్ ఆయా పార్టీల నుంచి వచ్చిన నేతలతో తనకంటూ ఓ గ్రూపును తయారు చేసుకుని టీడీపీ నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఇక నామినేషన్లు వేసే సమయానికి టీడీపీ అస్త్రసన్యాసంతో వీరేశ్ కూడా పోటీ నుంచి తప్పుకోవటంతో ఆయన వెంట నడిచిన నాయకులందరూ అయోమయానికి గురవుతున్నారు. బీజేపీ నుంచైనా అయినా పోటీ చేయాలని అనుచరులు కోరగా.. తండ్రీతనయులిద్దరూ గులాబీ కండువా కప్పుకోవటంతో, వారిని నమ్ముకొని మోసపోయామంటూ వాపోతున్నారు.

వైఎస్ఆర్ పాలన తెస్తాం

- 'గ్యారంటీ'లను పక్కాగా అమలు చేస్తాం
- వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాద్‌కుమార్
- ఎంపీ రంజిత్‌రెడ్డి.. రూ.300కోట్ల దాణా స్కాం చేశాడని ఆరోపణ

బంట్వారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం తెస్తామని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సంక్షేమ పాలనను అందిస్తామని కాంగ్రెస్ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం కోట్‌పల్లి మండలం కొత్తపల్లి, ఎన్కెపల్లి, బార్వాద్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతి సొమ్మును పంచేందుకు డబ్బు సంచులతో తిరుగుతున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీ రంజిత్‌రెడ్డి.. రూ.300 కోట్లకు పైగా దాణా స్కాం చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అంతా కక్కిస్తామని చెప్పారు. హైదరాబాద్ చుట్టూ పెద్ద ఎత్తున భూ కబ్జాలకు పాల్పడ్డారని విమర్శించారు. రంజిత్‌రెడ్డి ఎన్ని కుట్రలు పన్నినా.. నియోజకవర్గ ప్రజలు తన వైపే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం కేసీఆర్‌కు ఓట్లు అడిగే అర్హత లేదని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని మాజీ మంత్రి కోరారు. అధికారంలోకి రాగానే మేనిఫెస్టోతో పాటు ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, రాష్ట్ర పధాన కార్యదర్శి ఎంఏ వాహిద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు సుభాష్‌యాదవ్, రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథం పై నుంచి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్

వారంటీ లేని గ్యారంటీలు వద్దు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- బీఆర్ఎస్‌తో అభివృద్ధే ముద్దు
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: వారంటీ లేని గ్యారంటీ పథకాలు వద్దని, బీఆర్ఎస్ అభివృద్ధే ముద్దని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అరవై ఏళ్లలో జరగని అభివృద్ధి.. కేవలం ఈ పదేళ్ల కాలంలో సీఎంతోనే తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ కాపీ కొట్టిందని, అధికారంలోకి వస్తే వాటిని అమలు చేస్తామని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకను కాంగ్రెస్ ప్రభుత్వమే పాలిస్తోందని, అక్కడ గ్యారంటీ పథకాలు అమలు అవుతున్నాయో ఒక్కసారి పరిశీలించుకోవాలని ఆ పార్టీ నాయకులకు సూచించారు. ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తూ.. కాంగ్రెస్ మోసం చేస్తుందని, కానీ ఆ పార్టీని నమ్మేస్థితిలో వారు లేరన్నారు. నేడు వృద్ధులు, వితంతువు, వికలాంగులు దర్జాగా బతుకుతున్నారంటే అది కేసీఆర్ పుణ్యమేనని, కావున ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం

- ఎన్నికల పరిశీలకుడు మునిష్ రజినీ
- చెక్‌పోస్టు తనిఖీ



చెక్ పోస్టును తనఖీ చేస్తున్న మునిష్ రజినీ

మర్పల్లి: ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర చాలా గొప్పదని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు సమష్టిగా పనిచేయాలని ఎన్నికల పరిశీలకుడు మునిష్ రజినీ సూచించారు. శనివారం వికారాబాద్, సంగారెడ్డి జిల్లా సరిహద్దు కొంషెట్‌పల్లి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆయన వికారాబాద్ డీఎస్పీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు, మర్పల్లి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజా సంక్షేమం

- హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రజల కోసం పనిచేసే పార్టీ కాంగ్రెస్ అని, తమ హయాంలోనే పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలన నచ్చక ఎంతో మంది పార్టీలో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన సముచిత స్థానం కల్పిస్తామని, కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అధికారంలోకి రాగానే అందరికీ మేలు జరుగుతుందని, మేనిఫెస్టోతో పాటు అర్హులకు గ్యారంటీ పథకాలను అందజేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.



దోమ: ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పథకాల పేరుతో మోసం

దోమ: తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దోమ మండలం పాలేపల్లి, ఐనాపూర్, మోత్కుర్, బాసుపల్లి, ఖమ్మంనాచారం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలను విస్మరించి, సంక్షేమ పథకాల పేరుతో మోసాలకు పాల్పడుతుందని ఆరోపించారు. వారికి అందాల్సిన ఫలాలు పక్కదారి పడుతున్నాయని విమర్శించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొందపెట్టి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. అధికారంలోకి వస్తే అందరికీ మేలు జరుగుతుందని చెప్పారు.

పండగకు వేళాయే.. పక్కారోడ్డు లేదాయే

- ఈ నెల 14న మెథడిస్టు జాతర
- తరలి రానున్న లక్షలాది మంది భక్తులు

ధారూరు: ఆసియా ఖండంలో ఎక్కడా లేని విధంగా ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఉత్సవాలు శతాబ్ది కాలం పూర్తి చేసుకున్నాయి. 101 వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో జాతర ఏర్పాట్లను ఉత్సవ కమిటి ప్రారంభించగా.. పండుగకు వచ్చే భక్తులకు సడక్ కష్టాలు ఎదురు కానున్నాయి. కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెన పూర్తి కాకపోవటంతో ధ్వంసమైన తాత్కాలిక రోడ్డు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా ఉత్సవానికి పక్షం రోజుల ముందు నుంచే కలెక్టర్, ఎస్పీ, డివిజన్, మండల అధికారులతో సమీక్షించి ఏర్పాట్లను పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఇదే అంశంపై అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం. 2019లో జరిగిన జాతర.. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా ఉత్సవాలను వాయిదా వేశారు. 2022లో మమ అనిపించారు. ఈ ఏడాదైనా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఉత్సాహంతో ఉన్నారు.



తాత్కాలిక రోడ్డు దుస్థితి

లక్షల మంది యాత్రికుల రాక..

ఆరు రోజుల పాటు జరిగే వేడుకకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది యాత్రికులు రోడ్డు మార్గం ద్వారా వస్తుంటారు. జాతర ప్రాంగణానికి వెళ్లాలంటే ముందుగా కాగ్నానదిని దాటాల్సి ఉంటుంది. ఈ నదిపై నిర్మిస్తున్న వంతెన పూర్తి కాకపోవటం, దోర్నాల్–స్టేషన్ ధారూరు మధ్య కాగ్నానదిలోంచి ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వరదనీటికి కొట్టుకు పోగా.. రాకపోకలకు ఆటంకంగా మారింది. ఉత్సవాల నేపథ్యంలో అధికారులు రహదారి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి విస్తరణకు రూ.10లక్షలు

ఆర్అండ్‌బీ ద్వారా తాత్కాలిక రోడ్డు విస్తరణకు గతేడాది బారికేడ్లు ఏర్పాటు చేయగా.. జాతర అనంతరం అవి చోరీకి గురయ్యాయి. మరలా ఏర్పాటు చేయాలంటే రూ.10 లక్షల నిధులు కావాలి. అవి వస్తే కానీ సమస్యకు పరిష్కారం దొరకదని అధికారులు భావిస్తున్నారు. నిధులు లేక నీరసిస్తున్న పరిస్థితుల్లో కలెక్టరే నిధులను సమకూర్చాల్సి ఉంటుందని ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. మీటరు సీసీ పైపులకు అదనంగా మరో 20 పైపులు వేసి రోడ్డును వెడల్పుగా చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు జాతరలో శానిటేషన్, వైద్యం తదితర వాటి కోసం సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని చెప్పారు. మండల స్థాయి అధికారులు మాత్రం కోఆర్డినేషన్ మీటింగ్ జరిగి, సౌకర్యాల కల్పనకు నిదులు కేటాయిస్తేనే జాతర ఏర్పాట్లు ముమ్మరం చేయవచ్చనే అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం.

క్లుప్తంగా

తనిఖీల్లో భారీగా నగదు సీజ్

కుల్కచర్లలో రూ.3.60లక్షలు స్వాధీనం

కుల్కచర్ల: ఎన్నికల నియమావళి ప్రారంభమైంది మొదలు రోజుకు రోజుకు భారీగా నగదు పట్టుడుతోంది. అధికారులు అవగాహన కల్పిస్తున్నా జనం అప్రమత్తం అవ్వడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రూ.50వేలకు మించి పట్టుబడితే అధికారులు నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో అంజిలయ్య అనుమానాస్పదంగా కవర్ పట్టుకుని తచ్చాడుతుండగా పోలీసులు చెకింగ్ చేశారు. తనిఖీల్లో పట్టుబడిన రూ.3.60లక్షలకు ఎటువంటి ధృవపత్రాలు లేకపోవడతో ఎన్నికల అధికారికి నగదు అప్పజెప్పామని ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు.

ప్రచారంలో ఉద్రిక్తత

- సంక్షేమ పథకాలపై ప్రశ్నల వర్షం
- గొల్లకురుమలు, దళితులపై దాడి చేసిన బీఆర్‌ఎస్ నేతలు



బీఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నిస్తున్న మిట్టకంకల్ గ్రామస్తులు

పూడూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సోదరి అర్చన శనివారం కుత్బుల్లాపూర్, మిట్టకంకల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గొల్ల కురుమలు డీడీ కట్టినా తమకు నేటికీ జీవాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. దళిత బంధు ఎవరకి ఇచ్చారని దళితులు నిలదీశారు. గెలిచిన తర్వాత వస్తాయని ఆమె బదులివ్వడంతో ఒక్కసారిగా వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు గొల్లకురుమలు, దళితులపై చేయిచేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ప్రచారం నిర్వహించేందుకు గ్రామస్తులు నిరాకరంచడంతో ఆమె చేసేదేమిలేక వెనుదిరిగారు. స్థానిక ఎస్‌ఐ చొరవతో గొడవ సద్దుమనిగింది.

లీడర్స్ హబ్ 'నవాబుపేట'

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉన్న నవాబుపేట మండలం జిల్లాల పునర్విభజనలో భాగంగా వికారాబాద్‌లో భాగమైంది. ప్రస్తుతం ఈ మండలం రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో ఉంది. సెగ్మెంట్‌లో రాజకీయ ఓనమాలు ప్రారంభించిన నేతలు రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలుగా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా అంచలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదుగుతూ వస్తున్నారు.

- స్థానిక సంస్థల నుంచి ప్రస్థానం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్‌గా ఎదిగిన నేతలు



సంజీవరావు



కాలె యాదయ్య



కె.యాదవరెడ్డి



నాగేందర్‌గౌడ్

వికారాబాద్ నవాబుపేట మండలం గేటు వనంపల్లి గ్రామానికి చెందిన బి.సంజీవరావు టీడీపీ, వైఎస్సార్‌సీపీలో పనిచేసి 2014 ఎన్నికలో సమయంలో కారెక్కారు. ఆయన వికారాబాద్ సెగ్మెంట్ నుంచి గడ్డ ప్రసాద్‌కుమార్‌పై టీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలుపొంది అసెంబ్లీ మెట్లెక్కారు. ఇదే మండలానికి చెందిన కాలె యాదయ్య స్వగ్రామం చించల్‌పేట్. ఆయన చేవెళ్ల నియోజకవర్గం నుంచి రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. 2014లో హస్తం గుర్తుపై గెలుపొందిన ఆయన అనంతరం గులాబీగూటికి చేరారు. 2018లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం అధికార బీఆర్‌ఎస్ సిట్టింగులకే టికెట్ ఖరారు చేయడంతో ఆయన హ్యాట్రిక్ కొట్టేందుకు తహతహలాడుతున్నారు. ఇదే మండలానికి చెందిన ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డి పులుమామిడి స్వగ్రామం. ఈయన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓ సారి కాంగ్రెస్ నుంచి మరో సారి టీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. వీరు ముగ్గురూ గతంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులుగా తమ రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించనవారే. మండల పరిధిలోని అత్తాపూర్ గ్రామానికి చెందిన నాగేందర్‌గౌడ్ ఎంపీపీ, విద్యా, మౌళిక వసతుల కల్పన చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్‌గా పనిచేశారు.

వ్యయం.. పరిమితం

- అభ్యర్థుల ఖర్చుపై ఈసీ స్పెషల్ నజర్
- ఒక్కో అభ్యర్థికి రూ.40లక్షల వరకు అవకాశం
- రోజు వారీ వివరాలు తప్పనిసరి

షాబాద్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పెట్టే వ్యయంపై ఎన్నికల కమిషన్ బృందాలు స్పెషల్ ఫోకస్ చేస్తున్నాయి. వీడియోలు చిత్రీకరిస్తూ ఎవరెంత ఖర్చు చేస్తున్నారో లెక్కిస్తారు. ప్రచారంలో ఉపయోగించే వాహనాలు, సౌండ్ సిస్టంలు, కండువాలు, కార్యకర్తల భోజనాలు, సభలు, సమావేశాలతో పాటు అన్ని రకాల ఖర్చులకు సంబంధితచిన లెక్కలు పరిగణలోకి వస్తాయి.

నిశిత పరిశీలన

జిల్లా స్థాయిలో ఎన్నికల పర్యవేక్షణ నిఘా బృందాలు ఉండగా నియోజకవర్గాల వారీగా పరిశీలనకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అభ్యర్థుల ఖర్చుపై నిఘా వర్గాలు నీడలా వెంటాడుతున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఆయా సెగ్మెంట్లలో ర్యాలీలు, ప్రచారాలు, సభలు, సమావేశాలతో పాటు గ్రామాల్లోనూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు డబ్బు అక్రమ రవాణాను నియంత్రించడానికి పకడ్బందీ చర్యలు చేపట్టింది.

రోజువారీ ఖర్చు విడుదల నిబంధన

ఎన్నికల నియమావళి ప్రకారం ఒక్కో అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలకు మించకూడదు. గత ఎన్నికల్లో ఈ ఖర్చు రూ.28 లక్షలు ఉండగా.. రూ.40 లక్షలకు పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ విడుదల చేసింది. గతంలో ఎన్నికల ఖర్చు వారాంతంలో లేదా పోలింగ్ ప్రక్రియ పూర్తయి కౌంటింగ్ జరిగే నాటికి చూపితే సరిపోయేది. కానీ, ప్రస్తుత ఎన్నికల్లో ఆ పరిస్థితే లేదు. అభ్యర్థి చేసే ఖర్చు ఏ రోజుకు ఆ రోజు విధిగా చూపించాలన్న నిబంధన అమల్లోకి తెచ్చారు. పెరిగిపోతున్న ఎన్నికల వ్యయాన్ని నియంత్రించాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ పటిష్ట చర్యలు చేపట్టింది. అభ్యర్థులు నిబంధనలకు లోబడే ఖర్చు చేయాలని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసి గెలుపొందిన అభ్యర్థి ఎన్నిక రద్దు చేసేందుకు ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్ వేసినప్పటి నుంచి నిత్యం జిల్లా ఎన్నికల అధికారికి విధిగా ఖర్చుల వివరాలు తెలపాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అభ్యర్థి నేరచరిత్ర వివరాలు అఫడవిట్‌లో పొందుపర్చాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.



నేడు ఆమనగల్లులో ప్రజా ఆశీర్వాద సభ

హాజరుకానున్న మంత్రి కేటీఆర్

ఆమనగల్లు: పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ కల్వకుర్తి అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు మంత్రి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నా రు. ఇప్పటికే కాలేజీ గ్రౌండ్స్‌లో నేలను చదునుచేసి వేదికను ఏర్పాటు చేశారు. వేదిక ముందు ప్రజలు కూర్చోవడానికి వీలుగా కుర్చీలు వేశారు. సభ ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరిశీలించారు. సభను విజయవంతం చేయడానికి టీఆర్‌ఎస్ నాయ కులు భారీ జనసమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు.

షాద్‌నగర్‌కు సైతం..

షాద్‌నగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం షాద్‌నగర్ పట్టణానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించాయి. పట్టణంలోని ముఖ్యకూడలిలో సాయంత్రం 5గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపాయి. సభకు కేటీఆర్ హాజరై ప్రజలనుద్దేశించి మాట్లాడతారని పేర్కొన్నాయి.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



బూత్‌స్థాయి ఏజెంట్లతో చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం బూత్‌స్థాయి ఏజెంట్లతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల్లో పక్కా ప్రణాళికతో పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. ప్రతీ బూత్ నుంచి అధిక మెజార్టీ వచ్చేలా పని చేయాలని పిలు పునిచ్చారు.ఆరు గ్యారంటీ పథకాలతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ మీర్ పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, మహిళా నా యకురాళ్లు గంగమ్మ, పద్మశ్రీ, స్థానిక నాయకు లు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, ఏడుదొడ్ల సు రేందర్ రెడ్డి,భాస్కర్,శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాణిక్‌రావు ఠాక్రేతో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భేటీ



చేవెళ్ల: కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీం భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డితో కలిసి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు మన్సూర్ అలీఖాన్, రోహిత్ చౌదరి, జాతీయ నాయకురాలు దీపాదాస్ మున్సీలతో భేటీ అయ్యారు. అగ్రనాయకులతో కలిసి త్వరలో చేవెళ్లలో బహిరంగ సభ నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నట్లు మాణిక్‌రావు ఠాక్రే చెప్పినట్లు తెలిపారు.

ఖర్చుపై అవగాహన

కందుకూరు: అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల వివరాలు, సేకరణ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు, ఐఆర్‌ఎస్ అధికారి శంకర్‌గుప్తా శనివారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రచారంతో పాటు, పబ్లిక్ మీటింగ్‌ల్లో ఖర్చులు ఎలా అంచనా వేయొచ్చో తెలిపారు. అభ్యర్థుల నుంచి ఏ రోజుకారోజు చేసిన ఖర్చు వివరాలను సేకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి 'పాలమూరు' రాజీనామా



ఫార్వర్డ్ పార్టీలో చేరిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

- ఆల్ ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీలో చేరిక

షాద్‌నగర్: ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఆశించి భంగపడిన పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. శనివారం పార్టీ జాతీయ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రసాద్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ ఎన్నికల్లో అతన్ని పోటీలో ఉంచేందుకు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డికి చైర్మన్ సురేందర్‌రెడ్డి బీఫాంను అందజేశారు.

బీజేపీ టికెట్ ఇవ్వకుండా మోసం చేసింది..

బీజేపీ తనకు టికెట్ ఇవ్వకుండా మోసం చేసిందని, అభిమానులు, కార్యకర్తల కోరిక మేరకు ఎన్నికల్లో తను పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న పోరాటంలో బరిలో నిలిచేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

12 మంది అభ్యర్థులు.. 13 సెట్లు



అందెల శ్రీరాములు యాదవ్ తరుపున నామినేషన్ దాఖలు చేస్తున్న ఆయన సతీమణి ఆండాలు

- రెండో రోజు నామినేషన్ల దాఖలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా తొలిరోజు జిల్లాలో ఆరు నామినేషన్లు దాఖలు కాగా, శనివారం 12 మంది అభ్యర్థులు 13 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు నలుగురు ఉన్నారు. చేవెళ్ల నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య, ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ తరఫున నామినేషన్లు దాఖలయ్యాయి. షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి రెండో రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడం విశేషం.

చిగురింత నామినేషన్

బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత ఆ పార్టీ అధిష్టానానికి షాక్ ఇచ్చారు. శనివారం ఆమె తరఫున మద్దతుదారులు నామినేషన్ దాఖలు చేశారు. ఆమె మొదటి నుంచి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న విషయం తెలిసిందే.అనూహ్యంగా అధిష్టానం మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. ఇప్పటికే ఆయన ప్రచారం కూడా ప్రారంభించారు. ఈ నెల 8న మధ్యాహ్నం 3 గంటలకు ఆయన నామినేషన్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నా రు. మేయర్ అదే పార్టీ తరఫున బరిలోకి దిగుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు.దీంతోమహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థి అంశం రసవత్తరంగా మారింది.

ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వ్యయ పర్యవేక్షకులు, ఎన్నికల పర్యవేక్షకులు ప్రేమ్ ప్రకాష్ మీనా, ప్రియరంజన్ శ్రీవాస్తవ, శంకర్ గుప్తా, వినోద్ కుమార్ పోలీసు, ఎక్సైజ్, జీఎస్టీ, ఐటీ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ జాయింట్ కమిషనర్ తరుణ్ జోషి, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ అవినాష్ మహంతి, రంగారెడ్డి కలెక్టర్ భారతి హోళికేరి, మేడ్చల్ కలెక్టర్ గౌతం పాల్గొన్నారు. ఎన్నికలను సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పోలీసు కమిషనరేట్‌పరిధిలో తీసుకున్న భద్రతా చర్యలు, అవసరమైన చోట్ల ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, అక్రమనగదు తరలింపు, నిబంధనలకు విరుద్ధంగాతరలిస్తున్న అక్రమ మద్యం వంటి వాటి మీద నమోదు చేసిన కేసులు.. ఎన్నికల బందోబస్తుకు సంబంధించిన.. ఇతర అంశాలపై చర్చించారు.

కాంగ్రెస్ స్పీడ్



కొడంగల్ రూరల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు



పరిగి: ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడి సతీమణి ఉమారెడ్డి



వికారాబాద్ అర్బన్: ప్రసాద్‌కుమార్‌కు మద్దతుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ప్రచారం

ప్రచార జోష్

జిల్లాలో ఎన్నికలు సమీస్తున్న కొద్దీ ప్రచారం హోరెత్తుతుంది. జిల్లా పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్స్‌తో ప్రధాన పార్టీలన్నీ దూసుకుపోతున్నాయి. కాంగ్రెస్, కారు, కమలం నేతలంతా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పలు నియోజవర్గాల్లో కుటుంబ సభ్యులు సైతం తమ తమ పార్టీల మేనిఫెస్టోలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు.

– వికారాబాద్ నెట్‌వర్క్

జంగ్ తెలంగాణ



కొడంగల్ రూరల్: కుమ్మరి వీధిలో..

కారు దూకుడు



మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ బైక్ ర్యాలీ



పరిగి: దోశ వేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

బీజేపీ ఆకర్ష్



కుల్కచర్ల: మారుతికిరణ్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు